సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 16 । జూన్ । 2023



8 నెలులుగా ఎదురుచూపులు

ప్రైవేటు భవనాల్లో నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాలకు ఎనిమిది నెలులుగా అద్దె చెల్లించకపోవడంతో టీచర్లు ఇక్కట్లు పడుతున్నారు. 8లో



తగ్గుతున్న 'సింగరేణి' బలం

సింగరేణి సంస్థ పరిధిలో గతంలో 56 భూగర్భ గనుల్లో 1.16 లక్షల మంది కార్మికులు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 42వేలకు తగ్గింది. 10లో

గరిష్టం / కనిష్టం
43° / 30°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఎండ ప్రభావం అధికంగా ఉంటుంది. గంటగంటకూ ఉష్ణోగ్రత పెరుగుతుంది. రాత్రి కూడా వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకుడు

పాల్వంచరూరల్ : మండలంలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం వైభవంగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. 108 సువర్ణ పుష్పాలతో అర్చన, హారతి, మంత్రపుష్పం, నివేదన సమర్పించారు. కార్యక్రమంలో వేద పండితులు పద్మనాభ శర్మ, అర్చకులు రవికుమార్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు చింత నాగరాజు, గంధం వెంగళరావు, కిలారు నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు పాదపూజ



కార్మికురాలి కాళ్లు కడుగుతున్న ఎంపీపీ

అశ్వారావుపేటరూరల్: కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించిన పారిశుద్ధ్య కార్మికులకు ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి గురువారం పాదపూజ చేశారు. రాష్ట్ర ఆవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అశ్వారావుపేట గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పల్లె ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులకు ఎంపీపీ కాళ్లు కడిగి పాదపూజ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు కూడా మరికొందరు కార్మికులకు పాద పూజ చేశారు.

నగదు పురస్కారానికి గురుకుల విద్యార్థుల ఎంపిక

భద్రాచలం: ఎన్ఐటీతో పాటు ఇటీవల ఇంటర్ ఫలితాల్లో భద్రాచలం గిరిజన గురుకుల కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. ఈ విద్యార్థులు హైదరాబాద్ రవీంద్రభారతిలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ చేతుల మీదుగా శనివారం నగదు పురస్కారం అందుకుంటారని కళాశాల ప్రిన్సిపాల్ దేవదాసు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఎన్ఐటీ అమీర్‌పూర్‌లో చదువుతున్న పి.చందన, ఎన్ఐటీ రూర్కెలాలో చదువుతున్న బి.ప్రియాంకకు చెరో రూ.40 వేల నగదు, ల్యాప్‌టాప్‌లను అందజేస్తారని వివరించారు. ఇంటర్‌లో ప్రతిభ చాటిన జి. నవ్య, టి.కీర్తన, కె.త్రిష, ఎస్. సౌభాగ్య, ఎస్. మల్లేశ్వరిలను రూ. 25 వేల చొప్పున నగదు అందించి సత్కరించనున్నారని తెలిపారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు 12 కౌంటర్లు

ఖమ్మంక్రైం: పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా తుది రాతపరీక్ష ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను ఖమ్మంలో పరిశీలిస్తున్నారు. కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థుల సర్టిఫికెట్లను బుధవారం నుంచి పరిశీలిస్తుండగా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. గతంలో దేహదారుఢ్య పరీక్షల కంటే ముందే సర్టిఫికెట్లను పరిశీలించేవారు. దీంతో తరబడి సమయం పట్టేది. కానీ ఈసారి పరీక్షలు పూర్తయ్యాక ధృవీకరణ పత్రాలు పరిశీలిస్తుంగా సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో త్వరగా ప్రక్రియ పూర్తవుతోంది. రోజుకు 700మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించనుండగా 6,425మంది అభ్యర్థుల పత్రాలను ఈనెల 26వరకు పరిశీలిస్తారు.

ట్రామాతో ధీమా



కొత్తగూడెంలోని ప్రభుత్వ ఆస్పత్రి

త్వరలో కొత్తగూడెంలో ఏర్పాటుకు చర్యలు

- 'టెరి' పేరుతో అత్యవసర సేవలకు శ్రీకారం
- గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించాలని నిర్ణయం
- హార్ట్, ట్రామా విభాగాల్లో ఆధునిక వైద్య సేవలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: బూర్గంపాడు సమీపంలోని కిన్నెరసాని వంతెన దగ్గర బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇందులో ఇద్దరు ఘటనా స్థలంలోనే కన్నుమూశారు. మరో ఇద్దరు చిన్నారులు భద్రాచలం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. అయితే రోడ్డు ప్రమాదాలు, గుండెపోటు వంటి అత్యవసర వైద్య సేవలు స్థానికంగా అందుబాటులో ఉంటే ఆ ఇద్దరు పిల్లల ప్రాణాలు దక్కేవన్న అభిప్రాయం సర్వత్రా నెలకొంది. జిల్లాలో ప్రస్తుతం ఇటు ప్రభుత్వ పరంగా, అటూ ప్రైవేటు రంగంలోనూ అత్యవసర వైద్య సేవలు అందించే ట్రామా కేర్ సెంటర్ పూర్తి స్థాయిలో అందుబాటులో లేదు. అయితే త్వరలోనే కొత్తగూడెం సర్వజన ఆస్పత్రిలో ట్రామాకేర్ సేవలు ప్రారంభం కానున్నాయి.

రోడ్డు ప్రమాద బాధితులే ఎక్కువ..

తాజా గణాంకాల ప్రకారం ఎమర్జెన్సీ విభాగానికి వచ్చే కేసుల్లో అత్యధికంగా రోడ్డు ప్రమాద బాధితులే ఉంటున్నారు. ఇందులో ప్రమాదం జరిగిన తర్వాత ఆస్పత్రిలో చేరకముందు సంభవిస్తున్న 35 శాతం మరణాలకు, ఆస్పత్రుల్లో చేరిన 24 గంటల్లోపు జరిగే 40 శాతం మరణాలకు తీవ్ర రక్తస్రావమే ప్రధాన కారణం. దీంతో రోడ్డు ప్రమాదాలు, పని ప్రదేశాల్లో ప్రమాదాలు, అగ్ని ప్రమాదాలు, మాతాశిశు, హార్ట్ అటాక్, బ్రెయిన్ స్ట్రోక్ వంటి వాటిని అత్యవసర వైద్య సేవలుగా పరిగణిస్తారు. ప్రమాదం జరిగిన లేదా సమస్య ఉత్పన్నమైన తర్వాత తొలి గంట (గోల్డెన్ అవర్)లోపు సరైన వైద్య సేవలు అందితే ప్రాణ నష్టాన్ని గణనీయంగా తగ్గించే వీలుంది. దీంతో ఆరు అత్యవసర విభాగాల్లో ఇటు మెడికల్, అటు సర్జికల్ వైపు పూర్తి స్థాయిలో ట్రామాకేర్ వైద్య సేవలను తెలంగాణ ఎమర్జెన్సీ రెస్పాన్స్ ఇనిషియేషన్ (టెరి) పేరుతో అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది.

30 పడకల సామర్థ్యంతో..

రాష్ట్ర వ్యాప్తంగా 55 ఆస్పత్రుల్లో టెరి సేవలు అందుబాటులోకి తేవాలని నిర్ణయించగా ఇందులో కొత్తగూడెం మెడికల్ కాలేజీ బోధనాస్పత్రి కూడా ఉంది. ఇక్కడ 30 పడకల సామర్థ్యంతో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయబోతున్నారు. ప్రస్తుతం ఉన్న వైద్య పరికరాలకు తోడు ఆటోక్లేవ్ మిషన్, మొబైల్ ఎక్స్‌రే, ఈ ఫాస్ట్, సెక్షన్ ఆపరేటర్స్, డిఫ్రిబ్రిలేటర్స్, సీ ఆర్మ్, అల్ట్రాసోనోగ్రఫీ, అల్ట్రా సౌండ్, సీటీ స్కాన్, వెంటిలేటర్లను సమకూర్చుతారు. ప్రస్తుతం ఉన్న ఆపరేషన్ థియేటర్ ఎక్విప్‌మెంట్‌ను మరింతగా మెరుగు పరుస్తారు. ట్రామా కేర్ పరిధిలోకి వచ్చే ఆరు విభాగాలతో పాటు ప్రకృతి విపత్తులు, తీసుకోవాల్సిన చర్యలు... మొత్తం 7 విభాగాలకు చెందిన స్పెషలిస్ట్ వైద్యులు, 7 విభాగాల నర్సింగ్, పారామెడికల్ సిబ్బందిని నియమిస్తారు.

రోడ్డు ప్రమాదాలు ఎక్కువే..



జిల్లా మీదుగా రెండు జాతీయ రహదారులు పోతున్నాయి. దీంతో ఇక్కడ రోడ్డు ప్రమాదాలు తీవ్రత ఎక్కువే. ఇక జూలై, ఆగస్టు నెలల్లో గోదావరి వరదల భయం వెంటాడుతూనే ఉంటుంది. రాష్ట్రంలో అడవులు ఎక్కువగా ఈ జిల్లాలోనే ఉన్నాయి. జిల్లా వాసులకు భద్రాచలం, కొత్తగూడెంలోనే వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. అక్కడ కూడా అత్యవసర ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన, అధునాత వైద్యం కోసం ఖమ్మం, వరంగల్, హైదరాబాద్‌కు రిఫర్ చేస్తున్నారు. అక్కడికి చేరుకునేలోపే విలువైన సమయం వృథా అవుతోంది. ఇక 'టెరి' ద్వారా ట్రామా కేర్ సేవలు అందుబాటులోకి వచ్చేందుకు ఏడాది సమయం పట్టే అవకాశం ఉంది. బూర్గంపాడు రోడ్డు ప్రమాదం మిగిల్చిన చేదు జ్ఞాపకాల నేపథ్యంలో.. స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు వైద్య సేవల పరంగా రాష్ట్ర స్థాయిలో హెల్త్ డైరెక్టర్‌గా ఉన్న గడల శ్రీనివాసరావు ప్రత్యేక చొరవ చూపించి సాధ్యమైనంత త్వరగా కొత్తగూడెం బోధనాస్పత్రిలో అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

'పల్లెప్రగతి'తోనే అభివృద్ధి



నర్సాపురం గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్ అనుదీప్, అధికారులు, ప్రజాప్రతినిధులు



భద్రాచలంలో పంచాయతీ కార్మికుడిని సన్మానిస్తున్న కలెక్టర్

కలెక్టర్ అనుదీప్

దుమ్ముగూడెం: పల్లె ప్రగతి కార్యక్రమంతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని కలెక్టర్ అనుదీప్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా దుమ్ముగూడెం మండలం నర్సాపురంలో గురువారం నిర్వహించిన పల్లెప్రగతి దినోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పల్లెల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేస్తోందని, సర్పంచ్‌లు, అధికారులు సైతం వాటిని సద్వినియోగం చేసి గ్రామాలను అభివృద్ధిపథంలో నడిపిస్తున్నారని చెప్పారు. తాను కూడా తెలంగాణ బిడ్డనేనని, గ్రామాలు గతంలో ఎలా ఉండేవో, ఇప్పుడెలా ఉన్నాయో తెలుసనని అన్నారు. గ్రామాలకు జాతీయ స్థాయి అవార్డులే అభివృద్ధికి నిదర్శనమన్నారు. వచ్చే ఏడాది రాష్ట్ర అవతరణ దినోత్సవం లోపు మండలంలోని ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీరందిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 50 వేల పోడు పట్టాలను త్వరలో అందజేస్తామని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల శ్రమ, కరోనా సమయంలో వారు చేసిన సేవలు వెలకట్టలేనివని చెప్పారు. ఈ సందర్భంగా వారిని సన్మానించి పారిశుద్ధ్య దుస్తులు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు తెల్లం సీతమ్మ మాట్లాడుతూ.. మండలంలో చాలా గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా సమస్య పరిష్కరించడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వారసత్వ పట్టాలు పంపిణీలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పడంతో స్పందించిన కలెక్టర్ తాగునీరు రాని గ్రామాల నివేదిక అందజేయాలని ఎంపీడీఓకు సూచించారు.



వెంటనే నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో డీపీఓ లక్ష్మీ రమాకాంత్, ఎంపీపీ రేసు లక్ష్మి, ఎంపీడీఓ ముత్యాలరావు, తహసీల్దార్ మణిధర్, సీఐ దోమల రమేష్, ఏఓ నవీన్‌కుమార్, ఆర్ఐలు ఆదినారాయణ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

జిల్లాలోనే ప్రధాన పంచాయతీ భద్రాచలం..

భద్రాచలంఅర్బన్: జిల్లాలోనే ముఖ్యమైన గ్రామ పంచాయతీ భద్రాచలం అని కలెక్టర్ అనుదీప్ అన్నారు. దశాబ్ది వేడుకల్లో భాగంగా గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ.. రామయ్య సన్నిధిలో ఉన్న గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సభలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. గతేడాది కాలంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్‌తో పాటు పలువురు ప్రముఖులు, ఉన్నతాధికారులు భద్రాచలం వచ్చినప్పుడు పంచాయతీ కార్మికులు విశేష సేవలందించారని అన్నారు. గోదావరి వరదల సమయంలోనూ ప్రజలకు అంటు వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చేస్తూ కాలనీలను శుభ్రపర్చారని చెప్పారు. అంతేకాక నిత్యం పురవీధులను శుభ్రం చేస్తూ భక్తులకు, స్థానికులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూస్తున్న పంచాయతీ కార్మికులకు సీతారామచంద్ర స్వామి వారి అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భద్రాచలం ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామకృష్ణ, డీఎల్‌పీఓ నవీన్, సీఐ నాగరాజు రెడ్డి, గ్రామ పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, జూనియర్ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఐటీసీ హెచ్‌ఆర్ మేనేజర్ మరడానా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగన్నాథపురానికి జాతీయ అవార్డు

- రేపు ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం
- పురస్కారం రావడంపై మంత్రి పువ్వాడ హర్షం

ములకలపల్లి: జాతీయ మంచినీటి వనరుల విభాగంలో ములకలపల్లి మండలం జగన్నాథపురం గ్రామ పంచాయతీకి జాతీయస్థాయిలో అవార్డు లభించింది. నీటి సంరక్షణకు చేపట్టిన చర్యల ఫలితంగా 2022 సంవత్సరానికి గాను ఈ పురస్కారం దక్కింది. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ 11 కేటగిరీల్లో 41 మంది విజేతలను ప్రకటించగా, ఇందులో ఉత్తమ రాష్ట్రంగా మధ్యప్రదేశ్, ఉత్తమ జిల్లాగా ఒడిశాలోని గంజాం, ఉత్తమ గ్రామ పంచాయతీగా జిల్లాలోని జగన్నాథపురం ఎంపిక కావడం విశేషం. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శనివారం నిర్వహించే కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్ ఈ అవార్డులు ప్రదానం చేయనున్నారు. విజేతలకు ప్రశంసపత్రంతో పాటు ట్రోఫీ, నగదు బహుమతులు అందజేస్తారు. వర్షపు నీటిని ఒడిసి పట్టడం, భూగర్భ జలాల అభివృద్ధి వంటి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టడంలో జగన్నాథపురం పంచాయతీ అగ్రభాగాన నిలిచి జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. ఎనిమిది హ్యాబిటేషన్లు ఉన్న ఈ గ్రామంలో 4వేల మంది జీవనం సాగిస్తున్నారు. పరిగెత్తే నీటిని నిధాన పరచడం, ఆ నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాలను వృద్ధి పరిచేందుకు పంచాయతీ పాలకవర్గంతో పాటు అధికారులు, సిబ్బంది విశేషంగా కృషి చేశారు. జలసంరక్షణ చర్యలపై గ్రామస్తులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు.



జగన్నాథపురం గ్రామ పంచాయతీ కార్యాలయం

అవార్డు పట్ల మంత్రి హర్షం

దేశంలోనే ఉత్తమ గ్రామ పంచాయతీగా జగన్నాథపురానికి అవార్డు రావడం పట్ల రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. అవార్డు పొందిన గ్రామ పంచాయతీ సర్పంచ్, జిల్లా కలెక్టర్ అనుదీప్, సిబ్బందికి అభినందనలు తెలిపారు. సీఎం కేసీఆర్ దార్శనికత వల్ల రూపొందించి, అమలు చేస్తున్న పల్లె ప్రగతి కార్యక్రమాలు ఈ విధంగా ప్రతిఫలాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. కాగా, గ్రామ సర్పంచ్ గడ్డం భవాని, కార్యదర్శి షేక్ ఇబ్రహీం గురువారం రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరారు. అక్కడి నుంచి శుక్రవారం విమానంలో ఢిల్లీ చేరుకోనున్నారు.

న్యాయపాలనలో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ అభివృద్ధి శాఖ ద్వారా ఇచ్చే న్యాయపాలనలో శిక్షణ కోసం ఎస్సీ న్యాయవాద పట్టభద్రుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎనిమిది మందికి అవకాశంఉండగా, అర్హులు ఈనెల 30వ తేదీలోగా ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి శిక్షణ ఇవ్వడంతో పాటు నెలకు రూ.వెయ్యి చొప్పున మూడేళ్ల పాటు స్టైఫండ్, రూ.6 వేలు పుస్తకాలు, ఫర్నీచర్ కోసం చెల్లిస్తామని తెలిపారు. అలాగే, కార్పొరేట్ కళాశాలలకు ఎంపికై న విద్యార్థుల ఒరిజినల్ ధృవపత్రాలను ఈనెల 17న తమ కార్యాలయంలో పరిశీలించనున్నందున విద్యార్థులు హాజరుకావాలని సూచించారు.

'పట్టణ ప్రగతి'ని విజయవంతం చేయండి

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 16, 17 తేదీలలో జరుగనున్న పట్టణ ప్రగతి, గిరిజనోత్సవం కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ అనుదీప్ పిలుపునిచ్చారు. మున్సిపల్, ఐటీడీఏ, ఇతర శాఖల అధికారులతో గురువారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్సిపాలిటీల్లో జాతీయ జెండాలు ఎగురవేయాలని, పట్టణ ప్రగతి ద్వారా మున్సిపాలిటీలకు వచ్చిన నిధుల వివరాలు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా పట్టణ ప్రజలకు జరిగిన లబ్ధి, పట్టణంలో ఏర్పాటు చేసిన మౌలిక వసతుల వివరాలను తెలియజేయాలని సూచించారు. పట్టణాభివృద్ధిలో జాతీయస్థాయిలో సాధించిన అవార్డుల గురించి ప్రజలకు వివరించాలని అన్నారు. పట్టణాల్లో నిర్మిస్తున్న సమీకృత వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్లు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, అర్బన్, అటవీ పార్కుల నిర్మాణం, పచ్చదనాన్ని పెంపొందించేందుకు 10 శాతం గ్రీన్ బడ్జెట్ కేటాయింపు తదితర అభివృద్ధి అంశాలను ప్రముఖంగా ప్రస్తావించాలని తెలిపారు. 17వ తేదీన నిర్వహించే గిరిజనోత్సవంలో భాగంగా గిరిజన గ్రామాల్లో సభలు ఏర్పాటు చేయాలని, వారి సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలను వివరించాలని చెప్పారు. గిరిజనోత్సవ నిర్వహణకు భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన భవనాన్ని ముస్తాబు చేయాలని ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజుకు సూచించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ కమిషనర్లు రఘు, అంకుషావలి, శ్రీకాంత్, ఉమామహేశ్వరరావు, పట్టణ ప్రగతి అధికారులు పాల్గొన్నారు.

'హరితం'లో ప్రథమం

- రాష్ట్రస్థాయిలో ఉత్తమ మున్సిపాలిటీగా ఇల్లెందు
- వరుసగా రెండోసారి ఎంపిక
- నేడు హైదరాబాద్‌లో అవార్డు ప్రదానం
- కేటీఆర్ చేతుల మీదుగా అందుకోనున్న చైర్మన్, కమిషనర్



డివైడర్‌పై మొక్కలతో పచ్చగా మారిన ఇల్లెందు పట్టణం

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాలిటీకి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు దక్కింది. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పురస్కారాలకు ఎంపిక చేసిన మున్సిపాలిటీల్లో హరితహారం పచ్చదనం విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది. స్వయం సహాయక సంఘాలు, వీధి వ్యాపారుల అభివృద్ధికి రుణాల పంపిణీలో రెండో స్థానం లభించింది. మూడున్నరేళ్ల కాలంలో అనేక సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధిలో ఇల్లెందు మున్సిపాలిటీ రాష్ట్రంలోనే అగ్రభాగాన నిలిచినట్లు మున్సిపల్ శాఖ గుర్తించింది. ముఖ్యంగా పట్టణం మధ్య నుంచి ప్రవహిస్తున్న బుగ్గవాగులో పేరుకుపోయిన పూడిక తొలిగించి వర్షాకాలంలో వాగు ఉప్పొంగి ఇళ్లల్లోకి నీరు చేరకుండా చేశారు. బుగ్గవాగును క్లీన్ అండ్ గ్రీన్ చేయడంతో దోమల బెడద తొలిగిపోయింది. కాగా, వరుసగా రెండు సంవత్సరాలు ఉత్తమ అవార్డుకు ఎంపిక కావడం పట్ల పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, హైదరాబాద్‌లోని శిల్పారామంలో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు శుక్రవారం అవార్డు అందుకోనున్నారు.

పలు సమస్యలు పరిష్కారం..

కోరగుట్ట భగీరథ ట్యాంక్ నుంచి ఇందిరానగర్, ఫైర్ స్టేషన్, జగదాంబ సెంటర్, కోర్టు ఏరియాల్లో వేసవికాలం మినహా రోజు విడిచి రోజు తాగునీరు అందిస్తున్నారు. మున్సిపాల్టీలో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి డంప్‌యార్డుకు చేరుస్తున్నారు. పట్టణంలోని ప్రధాన డ్రెయిన్లను శుభ్రం చేశారు. తద్వారా దుర్వాసన సమస్య పరిష్కారం అయింది. పట్టణంలో పలు చోట్ల ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఆక్రమణలు తొలిగించారు. శిథిలావస్థకు చేరిన పురాతన భవనాలను కూల్చేశారు. రైల్వే పట్టాల వెంట గల ఖాళీ స్థలం, పురాతన భవనాలను తొలిగించారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుని వివిధ మార్కెట్లు, స్ట్రీట్ వెండర్స్ కాంప్లెక్స్‌లు నిర్మించారు.

ఆరు జంక్షన్లలో హైమాస్ట్ లైట్లు..

పట్టణంలోని ప్రధాన రహదారి వెంట, ఆయా బస్తీల్లో ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేసి అంధకార సమస్యను పరిష్కరించారు. ముఖ్యమైన మహబూబాబాద్ క్రాస్‌రోడ్, గోవింద్ సెంటర్, కొత్త బస్టాండ్, బుగ్గవాగు, పాత బస్టాండ్, ప్రభుత్వ ఆస్పత్రి, జగదాంబా సెంటర్లలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుత పాలక వర్గం అధికారంలోకి వచ్చాక పట్టణంలో మోడల్ మార్కెట్, మల్టీయుటిలిటీ సెంటర్, కమ్యూనిటీ హాల్, స్కిల్ డెవలప్ సెంటర్, నర్సరీలు, పబ్లిక్ టాయిలెట్ల వంటి ప్రజావసర పనులు చేశారు.

కేటీఆర్ ప్రోత్సాహంతో ముందడుగు



ఇల్లెందు మున్సిపాలిటీ అభివృద్ధికి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రోత్సాహం, ఎమ్మెల్యే హరిప్రియ, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సహకారం మరువలేనివి. పట్టణాన్ని అన్ని విధాలా అగ్రభాగంలో నిలిపేందుకు పాలక వర్గం కృషి చేస్తోంది. మాతోపాటు కార్మికులు, సిబ్బంది, అధికారుల సమష్టికృషితో ఆక్రమణల తొలగింపు, బుగ్గవాగు క్లీనింగ్, అంబజార్ రోడ్ నిర్మాణం.. ఇలా రూ.153 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేస్తున్నాం. ప్రజల సహకారంతో పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నాం. – డి.వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్

ఘనంగా నగర సంకీర్తన

రామాలయంలో దశాబ్ది ఉత్సవాలు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా గురువారం ఘనంగా నగర సంకీర్తన నిర్వహించారు. శ్రీరామ ప్రచార రామరథంతో భక్త రామదాసు కీర్తనలను ఆలపిస్తూ మాడ వీధులతో పాటుగా ప్రధాన వీధుల్లో ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు, సిబ్బంది సంప్రదాయ వేషధారణతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆద్యంతం ఆధ్యాత్మికంగా జరిగింది. ఆలయ ఈఓ ఎల్.రమాదేవి, ఈఈ రవీందర్, ఏఈఓలు శ్రవణ్‌కుమార్, భవానీ రామకృష్ణ, ప్రధానార్చకులు విజయ రాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయంగా నిత్యకల్యాణం

శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.





శ్రీరామరథంతో నగర సంకీర్తనలో ఈఓ, అర్చకులు, సిబ్బంది (ఇన్‌సెట్) నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

రక్షణ చర్యలు నిరంతరం కొనసాగాలి



బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

మణుగూరు రూరల్ : గనుల్లో రక్షణ చర్యలు నిరంతరం కొనసాగాలని సౌత్ రీజియన్-1 డీఎంఎస్(మైనింగ్) ఉమేష్ మధుకర్‌రావు సావర్కర్, డీడీఎంఎస్(మైనింగ్) కమలేష్ కుమారవర్మ సూచించారు. సింగరేణి మణుగూరు ఏరియాలోని పీకే ఓసీని సందర్శించి బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పని ప్రదేశాల్లో ఉద్యోగులు పూర్తి రక్షణ పాటించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రక్షణ సూత్రాల పట్ల ఉద్యోగులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రమాద రహిత ఏరియాగా తెచ్చేందుకు అధికారులు, ఉద్యోగులు, సూపర్‌వైజర్లు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎం దుర్గం రామచందర్, అధికారులు కుమారస్వామి, నాగేశ్వరరావు, వెంకటరమణ, వీరభద్రుడు, రాంబాబు, ఎండి మదార్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై వేధింపుల కేసు

జూలూరుపాడు: అదనపు కట్నం కోసం వివాహితను వేధిస్తున్న నలుగురు వ్యక్తులపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఏఎస్సై తిరుపతిరావు కథనం ప్రకారం.. మండలంలోని మాచినేనిపేటకు చెందిన గుగులోతు నాగమణికి మాచినేనిపేటతండా గ్రామ పంచాయతీ జేత్యాతండాకు చెందిన నరసింహారావుతో 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా మూడేళ్ల నుంచి అదనపు కట్నం కోసం భర్త నరసింహారావుతోపాటు, అత్త ద్వాళి, మామ భీమ్లా, బావ లింబా శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. బాధితురాలు నాగమణి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

ఆర్‌ఎంపీ డాక్టర్‌కు తీవ్ర గాయాలు



డివైడర్‌ను ఢీకొట్టి ఆగిన కారు

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం సమీపాన కేరళ హైస్కూల్ మూలమలుపు వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో ఆర్‌ఎంపీ డాక్టర్ కటకం శంకర్‌రావుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో ఆర్‌ఎంపీగా ప్రాక్టీస్ చేస్తున్న శంకర్‌రావు గురువారం ఖమ్మం నుంచి పిండిప్రోలుకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. కేరళ హైస్కూల్ మలుపు వద్దకు రాగానే, ఖమ్మం శ్రీహర్ష హాస్పిటల్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్న ధరావత్ లక్ష్మణ్‌సింగ్ కారులో అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో శంకర్‌రావుకు తీవ్ర గాయాలు కాగా, లక్ష్మణ్ కారు ఆపకుండా కొంతదూరం వెళ్లి డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో కారులో ఉన్న మహిళ సైతం గాయపడింది. క్షతగాత్రుడి కుమారుడు కరుణసాయి ఫిర్యాదుతో డాక్టర్ లక్ష్మణ్‌సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి




మృతి చెందిన దుక్కిటెద్దు

అశ్వారావుపేటరూరల్: మండుతున్న ఎండలతో దాహార్తి తీర్చుకునేందుకు వెళ్లిన ఎద్దు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. మండలంలోని జమ్మిగూడేనికి చెందిన రైతు రెడ్డి వీరయ్య దుక్కిటెద్దు రోజు మేతకు వెళ్లి, సమీపంలోని ఓ బోరు వద్ద ఉన్న నీటి గుంతలో దాహార్తి తీర్చుకుంటోంది. గురువారం కూడా నీళ్లు తాగేందుకు వెళ్లింది. అప్పటికే తెగిపడి ఉన్న బోరు వైరు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు.

ఉరి వేసుకుని ఆత్మహత్య

ఇల్లెందు: అనారోగ్య కారణాలతో జీవితం మీద విరక్తి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం పట్టణంలోని డీ బ్లాక్ వద్ద చోటుచేసుకుంది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న డీ బ్లాక్ ఏరియాకు చెందిన జగన్నాథ్ కహార్(75) సమీపంలోని సీతారాం మామిడి తోటలో చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఆయన భార్యలో గతంలోనే మృతి చెందగా, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారుడు రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,346

8 నెలలుగా ఎదురుచూపులు

పేరుకుపోతున్న అద్దె బకాయి

- జిల్లాలో 785 అంగన్‌వాడీ కేంద్రాలు కిరాయి భవనాల్లోనే..
- టీచర్లపై ఒత్తిడి చేస్తున్న ఇంటి యజమానులు
- ఖాళీ చేయాలంటూ కొన్నిచోట్ల కేంద్రాలకు తాళం
- పట్టించుకోని ఐసీడీఎస్ ఉన్నతాధికారులు



కొత్తగూడెం కూలీలైన్‌లోని అంగన్‌వాడీ కేంద్రం

కొత్తగూడెంటౌన్: ఎనిమిది నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దె చెల్లించకపోవడంతో టీచర్లు ఇక్కట్లు పడుతున్నారు. అద్దె చెల్లించకపోతే ఇల్లు ఖాళీ చేయాలని యజమానులు ఒత్తిడి చేస్తున్నారు. కొనిచోట్ల కేంద్రాలకు తాళాలు కూడా వేశారు. అయినా ఐసీడీఎస్ ఉన్నతాధికారులు అద్దె చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అంగన్‌వాడీ టీచర్లు ఆరోపిస్తున్నారు. జిల్లాలోని 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో మెయిన్ అంగన్‌వాడీలు 1434, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 626.. మొత్తం 2,060 ఉన్నాయి. వీటిల్లో 782 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. మరో 493 కేంద్రాలు ఉచిత భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇంకా 785 కేంద్రాలు అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. కొత్తగా 50 కేంద్రాలకు భవనాల నిర్మాణం చేపట్టారు.

అద్దె చెల్లింపులు ఇలా..

ఒక్కో అంగన్ వాడీ కేంద్రానికి ఆయా ఏరియాను బట్టి రూ.600 నుంచి రూ.3,000 వరకు ప్రభుత్వం అద్దె చెల్లిస్తోంది. అర్బన్ పరిధిలో రెండు గదులకు రూ.3000, ఒక గదికి రూ.2000, గ్రామీణ ప్రాంతాల్లో ఒక గది ఉంటే రూ.600, రెండు గదులు ఉంటే రూ.1200 వరకు కిరాయి చెల్లిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య, రికార్డుల నిర్వహణ తదితర అవసరాలను బట్టి ఒక గది, రెండు గదులు, మూడు గదుల చొప్పున అద్దెకు తీసుకుని కేంద్రాలు నిర్వహిస్తున్నారు. అద్దె బకాయి విడుదల కాకపోవడంతో 785 మంది టీచర్లు ఇంటి యజమానులకు సమాధానం చెప్పలేక ఇబ్బందులు పడుతున్నారు.

సెంటర్లకు తాళాలు

ఎనిమిది నెలల నుంచి అద్దె చెల్లించకపోవడంతో ఇంటి యజమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అద్దె చెల్లించలేదంటూ ఈ నెల మొదటి వారంలో కొత్తగూడెం కూలీలైన్ అంగన్‌వాడీ కేంద్రానికి యజమాని తాళం వేశాడు. అంగన్‌వాడీ సిబ్బంది విషయాన్ని జిల్లా సంక్షేమశాఖ అధికారులకు ఫోన్‌లో వివరించగా.. వారు యజమానికి హామీ ఇవ్వడంతో మళ్లీ అంగన్‌వాడీ సెంటర్ తెరుచుకుంది. మరికొన్ని చోట్ల అద్దె కట్టకపోతే ఇళ్లు ఖాళీ చేయాలని యజమానులు ఒత్తిడి చేస్తున్నారు.

తక్షణమే చెల్లించాలి



అంగన్‌వాడీ సెంటర్ల అద్దెలను తక్షణమే చెల్లించాలి. కిరాయి విడుదల కాకపోవడంతో ఓనర్ల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తోంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. ఇప్పటికైనా అద్దె బకాయిలు చెల్లించాలి.

– ప్రతిభాభారతి, మధురబస్తీ అంగన్‌వాడీ సెంటర్, కొత్తగూడెం

తాళం వేస్తామంటున్నారు..



అద్దె కడతారా? లేదంటే అంగన్‌వాడీ సెంటర్‌కు తాళం వేయమంటారా? అని యజమానులు ఒత్తిడి చేస్తున్నారు. అద్దె సొమ్ము చెల్లించాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. అద్దె చెల్లించి మా ఇబ్బందులు తొలగించాలి.

– గోనె మణి, అంగన్‌వాడీ టీచర్, బూడిదగడ్డ



కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయం

చెల్లింపుల్లో తీవ్ర జాప్యం



ఎనిమిది నెలలుగా కేంద్రాల అద్దెలు రావడం లేదు. దీంతో ఇంటి యజమానులు మమ్మల్ని ఖాళీ చేయాలంటూ ఇబ్బంది పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు అద్దె బిల్లులు తక్షణమే చెల్లించాలి. ఎన్ని వాయిదాలు పెడుతారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– రమాదేవి, అంగన్‌వాడీ టీచర్, రామవరం

త్వరలోనే చెల్లిస్తాం



జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల అద్దె బకాయి త్వరలో చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ విషయమై ఉన్నతాధికారులకు వివరించగా, అతి త్వరలో విడుదల చేస్తామని తెలిపారు.

– ఎం.సబిత, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి

తుపాన్లతో 'నైరుతి' ఆలస్యం..

- ఈ నెల 20 నాటికి రుతుపవనాలు విస్తరించే అవకాశం
- కృషి విజ్ఞాన కేంద్రం అధికారుల వెల్లడి

సూపర్‌బజార్(కొత్తగూడెం): మోకా, బిపర్‌జోయ్ తుపాన్ల కారణంగా రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ప్రవేశం ఆలస్యమవుతోందని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ, వాతావరణ విభాగం పర్యవేక్షకుడు ఎం.సుమన్ గురువారం తెలిపారు. బిపర్‌జోయ్ తుపాను ప్రభావం 16వ తేదీ నుంచి తగ్గే అవకాశం ఉందని, ఈ నెల 20వ తేదీ నాటికి నైరుతి రుతుపవనాలు రాష్ట్రమంతటా విస్తరించే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం నుంచి సమాచారం ఉందని పేర్కొన్నారు. రానున్న మూడురోజులు జిల్లాలో వడగాలులతోపాటు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. అదే సమయంలో జిల్లాలో 41 నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ప్రస్తుతం అక్కడక్కడ జిల్లాల్లో కురుస్తున్న వర్షాలు రుతుపవనాల వల్ల కురిసే వర్షాలు కావు. ఈ వర్షాలను ఆధారంచేసుకుని వర్షాధార పంటలు విత్తుకోవద్దు. ఒకవేళ రైతులు తొందరపడి విత్తుకున్నట్లయితే నేలలో ఉన్న వేడిమికి విత్తనాలలో మొలకశాతం తగ్గిపోతుంది.
- నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన తర్వాత వారం రోజుల వ్యవధిలో తేలిక నేలల్లో 50-60 మి.మీ. వర్షపాతం, బరువునేలల్లో 60-75 మి.మీ వర్షపాతం నమోదయ్యాక మాత్రమే వర్షాధార పంటలైన మొక్కజొన్న, జొన్న, కంది, పెసర, మినుము, పత్తి పంటలను విత్తుకోవాలి. తద్వారా మొలకశాతం బాగా ఉండి పంట నష్టపోకుండా సరైన సాంద్రతతో మొక్కలు ఉండేలా చూసుకోవడానికి వీలవుతుంది.
- ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను ఉపయోగించుకుని రైతులు పంటలు విత్తుకోవడానికి దుక్కులు చేసుకోవాలి.
- వర్షాధారపు పంటలను సరైన సమయంలో విత్తుకోవడానికి విత్తనాలు, ఎరువులు, కలుపుమందులు, పురుగు మందులు సేకరించుకోవాలి.
- వరిసాగు చేసే రైతులు పచ్చిరొట్ట పైరుగా జనుము, జీలుగ మొదలైన పచ్చిరొట్ట పైర్లను తప్పనిసరిగా వేసుకుని నాట్లు వేసే ముందు భూమిలో కలియదున్నితే నేలసారం పెరుగుతుంది.
- ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే సమయంలో రైతులు చెట్లకింద నిలబడవద్దు. పశువులు, గొర్రెలు, మేకలను చెట్ల కింద ఉంచరాదు.
- ఉరుములు, పిడుగులు పడే సమయంలో రైతులు విద్యుత్ స్తంభాలను తాకడం, విద్యుత్ మోటార్లను ఆన్‌చేయడం వంటివి చేయకూడదు.

కమ్యూనిస్టు కార్యాలయాలు కనిపించే దేవాలయాలు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

ఏన్కూరు: కమ్యూనిస్టు పార్టీల కార్యాలయాలు పేద ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసే దేవాలయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అభివర్ణించారు. ఏన్కూరులో సీపీఐ కార్యాలయ నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ కార్యాలయం ప్రజల భాగస్వామ్యంతో నిర్మాణమవుతోందని తెలిపారు. కాగా, దేశంలో నరేంద్రమోదీ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ప్రజలు, రైతులు, కార్మికులు కలిసిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, నాయకులు ఎర్రా బాబు, చంద్ర నరేంద్రకుమార్, జాగర్లమూడి రంజిత్‌కుమార్, అమరనేని వీరభద్రం, తెప్పల సత్యం, మేడ భూసయ్య, తాళ్లూరి చలపతిరావు, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, రాంబాబు, నర్సయ్య, రమేశ్, రమణయ్య, శ్రీరాములు, బసవయ్య పాల్గొన్నారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

పాల్వంచ: వడదెబ్బకు గురై ఓ వృద్ధుడు గురువారం మృతి చెందాడు. పట్టణంలోని ఒడ్డుగూడేనికి చెందిన సోమశెట్టి పురుషోత్తం(60) రెండు రోజుల క్రితం వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇతను పాత ఇంజనీరింగ్ కళాశాలలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మృతునికి భార్య దుర్గ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి కుటుంబానికి వర్తక సంఘం కన్వీనర్ చలవాది ప్రకాశ్ రూ.5 వేల ఆర్థికసాయం అందించారు. ఆయన చొరవతో మరికొందరు వ్యాపారులు కలిసి మరో రూ.20వేలను అందించారు.

పంచాయతీ ఆఫీస్‌కు తాళం

మొక్కంపాడు జీపీలో రెండు చోట్ల పల్లె ప్రగతి వేడుకలు



తాళం వేయడంతో మొక్కంపాడు ఆఫీస్ బయట ఉన్న కార్యదర్శి, వార్డు సభ్యులు తదితరులు



మొక్కంపాడుతండాలో వేడుకలు నిర్వహిస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్, కార్యదర్శి, వార్డుసభ్యులు

టేకులపల్లి: మండలంలోని మొక్కంపాడు పంచాయతీలో రెండు గ్రామాల్లో పల్లె ప్రగతి వేడుకలు నిర్వహించారు. ఈ పంచాయతీలో మొక్కంపాడు (ఆదివాసీల గుంపు), మొక్కంపాడుతండా(లంబాడీ తండా) రెండు గ్రామాలు ఉన్నాయి. అధికారికంగా మొక్కంపాడు పేరుతోనే పంచాయతీ ఏర్పడింది. పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా కార్యదర్శి సరిత ఉదయం ఏడున్నరకు మొక్కంపాడుకు చేరుకుంది. గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి, తాళం చెవిని సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు తమ వద్దనే తండాలోనే ఉంచుకున్నారు. దీంతో కార్యదర్శి, ముగ్గురు వార్డు సభ్యులు సర్పంచ్‌కు ఫోన్ చేసి తాళం చెవి అడిగితే ఇవ్వలేదు. ఎమ్మెల్యేతో ఎంపీడీఓ, ఎంపీఓలకు ఫోన్ చేయించామని, తండాలోనే వేడుకలు నిర్వహించాలని, ఇక్కడికే రావాలని సర్పంచ్, ఉప సర్పంచ్ సమాధానం ఇచ్చారు. దీనికి మొక్కంపాడు(ఆదివాసీ గుంపు) వాసులు ఒప్పుకోలేదు. దీంతో తప్పనిసరి పరిస్థితిలో ఉదయం 9 గంటల ప్రాంతంలో కార్యదర్శి, ముగ్గురు వార్డు సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో పంచాయతీ ఆఫీసు తాళం పగులకొట్టి వేడుకలు నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ చేపట్టి జాతీయ జెండా ఎగురవేశారు. గ్రామ సభ ఏర్పాటు చేసి పల్లె ప్రగతి వివరాలు వెల్లడించారు. కాగా ఉదయం 10 గంటల ప్రాంతంలో మొక్కంపాడుతండాలో సర్పంచ్ విజయ, ఉప సర్పంచ్, నలుగురు వార్డు సభ్యుల ఆధ్వర్యంలో పల్లె ప్రగతి వేడుకల ఏర్పాట్లు చేయగా ఎంపీడీఓ ఆదేశాలతో కార్యదర్శి కూడా పాల్గొన్నారు. అక్కడ కూడా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండా ఎగురువేసి, గ్రామ సభ జరిపారు. ఈ నెల 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం కూడా రెండు గ్రామాల్లో జరుపుకోవడం గమనార్హం. మొక్కంపాడుతండాలోనే పంచాయతీ కార్యాలయం ఉండాలని కొంత కాలంగా సర్పంచ్, ఉప సర్పంచ్‌తో పాటు నలుగురు వార్డు సభ్యులు, తండా ప్రజలు ఉన్నతాధికారులకు విన్నవిస్తున్న విషయం విదితమే. మరోవైపు అధికారికంగా ఏర్పాటైన పంచాయతీ మొక్కంపాడులోనే ఉండాలని ఆదివాసీ గుంపు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఊట్లపల్లి పంచాయతీ నల్లబాడు గ్రామ సమీపంలోని ఓ రైతు పొలం వద్ద గురువారం గుర్తుతెలియని వ్యక్తులు బీడీ కాల్చి పడేయడంతో మంటలు అంటుకున్నాయి. పొలం గట్టు మీదుగా అక్కడే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వరకు వ్యాపించాయి. స్థానికుల సమాచారంతో ఫైరింజన్‌తో వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. దీంతో ప్రమాదం తప్పింది.

పామాయిల్ తోట దగ్ధం



కాలిపోయిన పామాయిల్ తోట

దమ్మపేట: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పామాయిల్ తోట పాక్షికంగా దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని పట్వారిగూడెం గ్రామ శివారులో గురువారం వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం... పట్వారిగూడెం గ్రామానికి చెందిన రైతు పెంకె రాజారావుకు నాలుగు ఎకరాల లేత పామాయిల్ తోట ఉన్నది. గురువారం తోటకు వెళ్లిన రాజారావు డ్రిప్, పామాయిల్ చెట్లు కాలిపోయి ఉండటం చూసి కన్నీటి పర్యంతమయ్యాడు. స్థానిక రైతులు, జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు రైతును ఓదార్చారు. సుమారు రూ.2 లక్షల వాటిల్లిందని రైతులు తెలిపారు.

పరామర్శకు వచ్చి పరలోకాలకు..

- బైక్, ఆటోలను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- ఒకరు మృతి, మరో ముగ్గురికి గాయాలు



అవినాష్(ఫైల్)

బూర్గంపాడు: బంధువుల పరామర్శకు వచ్చిన ఓ యువకుడిని మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. అదే ప్రమాదంలో మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన మండల పరిధిలోని పినపాక పట్టీనగర్ వద్ద గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఇల్లెందుకు చెందిన ఉల్లోజు అవినాష్(33) పినపాక పట్టీనగర్ గ్రామానికి చెందిన జ్యోతిని 2019లో వివాహం చేసుకున్నాడు. వీరు పాల్వంచలోని టీచర్స్ కాలనీలో జీవనం సాగిస్తున్నారు. కేటీపీఎస్‌లో ఎస్‌ఈ కారుడ్రైవర్‌గా, టీ మీడియా వెబ్ చానల్ రిపోర్టర్‌గా పనిచేస్తూ అవినాష్ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో పినపాక పట్టీనగర్‌కు చెందిన జ్యోతి అక్క కొట్టి భారతమ్మ కుమారుడు నరేష్ కాలు విరిగింది. దీంతో అతన్ని పరామర్శించేందుకు దంపతులిద్దరూ పట్టీనగర్‌కు వచ్చారు. అనంతరం ఫ్రూట్స్, కూల్‌డ్రింక్స్ తీసుకొచ్చేందుకు అవినాష్ బైక్‌పై బయటకు వెళ్లగా ప్రమాదం జరిగింది. గుంటూరు నుంచి భద్రాచలం వస్తున్న ఆర్టీసీ బస్సు జాతీయ రహదారిపై లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను, ఆ వెనుక ఉన్న ఆటోను ఢీ కొట్టింది. దీంతో బస్సు చక్రాల కిందపడి శరీరం ఛిద్రమై అవినాష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆటోలో వస్తున్న భద్రాచలం సమీపంలోని పిచుకులపాడుకు చెందిన అజ్మీరా అగ్ని, అతని భార్య అనసూయ, కొడుకు బిట్టు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం స్థానికులు ఆస్పత్రికి తరలించారు. కాగా అన్యోన్యంగా సాగుతున్న అవినాష్, జ్యోతి దంపతుల జీవితంలో రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. భర్త మృతదేహం ఆమె రోదిస్తున్న తీరు అందరిని కలచివేసింది. మృతుడికి తల్లి ఉండగా, తండ్రి చిన్నప్పుడే మృతి చెందాడని బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్ పేర్కొన్నారు.

భార్యను నాటు తుపాకీతో కాల్చిన భర్త

- మహిళ పరిస్థితి విషమం..
- కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స



తీవ్రంగా గాయపడిన లావుడ్యా శాంతి



ఆస్పత్రిలో దీనంగా కూర్చున్న శాంతి పిల్లలు



గ్రామంలో విచారణ చేపడుతున్న డీఎస్పీ రెహమాన్

జూలూరుపాడు: ఓ వ్యక్తి భార్యను నాటు తుపాకీతో కాల్చిన ఘటన జూలూరుపాడు మండలం భోజ్యాతండా(పుల్లుడుతండా)లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుల్లుడుతండాకు చెందిన లావుడ్యా సామ్యా అలియాస్ శంకర్, అతడి భార్య శాంతి అలియాస్ బుజ్జి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో సామ్యా తాగుడుకు బానిసై భార్య, పిల్లలను వదిలేసి గుండ్లరేవు పంచాయతీ రాంపురం తండాలోనే ఉంటుండేవాడు. బుజ్జి తన నలుగురు పిల్లలతో పుల్లుడుతండాలో ఉంటోంది. కాగా, సామ్యా ఇటీవల తిరిగి ఇంటికి రావడంతో మళ్లీ భార్యాభర్తల మధ్య మళ్లీ గొడవ జరిగింది. ఈ క్రమంలో గురువారం రాత్రి కిరాణా దుకాణానికి వెళ్లి సరుకులు తీసుకొని వస్తున్న శాంతిని సామ్యా వెనక నుంచి నాటు తుపాకీతో కాల్చడంతో పొట్ట, ఛాతీ మధ్యలో నుంచి బుల్లెట్ బయటకు దూసుకెళ్లింది. దీంతో తీవ్ర రక్తస్రావంతో శాంతి అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు వచ్చి పరిస్థితి విషమంగా ఉన్న బుజ్జిని 108 వాహనంలో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి ఆరోగ్య ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కొత్తగూడెం డీఎస్పీ ఎస్‌కే అబ్దుల్ రహమాన్, జూలూరుపాడు ఎస్సై పోటు గణేష్ పుల్లుడుతండా చేరుకుని సామ్యాపై కేసు నమోదు చేశారు.

నాటు తుపాకీ ఎక్కడిది?

గతంలో లావుడ్యా సామ్యా నాటు తుపాకీతో అడవి జంతువులను వేటాడి చంపేవాడు. మూడేళ్ల క్రితం సామ్యా దగ్గరు నాటు తుపాకీ ఉందనే సమాచారంతో సామ్యాతోపాటు, అతడి సోదరుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. జైలుకు వెళ్లి వచ్చిన తరువాత సామ్యా జంతువుల వేట ఆపేసి వ్యవసాయం చేసుకుంటుండేవాడు. అయితే సామ్యాను అరెస్టు చేసిన పోలీసులు నాటు తుపాకీని స్వాధీనం చేసుకోలేదా? లేకపోతే మరో నాటు తుపాకీ అతని వద్ద ఉందా? అనే విషయం పోలీసుల విచారణలో తేలనుంది. కాగా, కాల్పుల అనంతరం సామ్యా పారిపోతుండగా గ్రామ శివారులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి నాటు తుపాకీని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఆడిటర్ సహా.. విశాఖ ఎంపీ భార్య, కొడుకు కిడ్నాప్

4 గంటల్లోనే కథ సుఖాంతం

- రెండ్రోజుల క్రితం ఎంపీ కుమారుడు శరత్ ఇంట్లో చొరబడిన దుండగులు
- అతడితోనే ఫోన్ చేయించి తల్లిని రప్పించిన కిడ్నాపర్లు
- ఆమె ద్వారా ఆడిటర్ జీవీని పిలిపించి నిర్బంధం
- ముగ్గురి మెడపై కత్తిపెట్టి డబ్బు ఇవ్వాలంటూ బెదిరింపులు
- రూ.1.75 కోట్లు ఇచ్చినా.. ఇంకా కావాలంటూ డిమాండ్
- గురువారం ఉదయం వెలుగులోకి వచ్చిన కిడ్నాప్ వ్యవహారం
- సినీ ఫక్కీలో కిడ్నాపర్లను నాలుగు గంటల్లోనే పట్టుకున్న పోలీసులు

దొండపర్తి (విశాఖ దక్షిణ)/విశాఖ విద్య: విశాఖపట్నం ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ భార్య, కుమారుడితో పాటు ప్రముఖ ఆడిటర్ జీవీ కిడ్నాప్ వ్యవహారం గురువారం సంచలనం రేకెత్తించింది. సినీ ఫక్కీలో దుండగులు ఎంపీ కుమారుడు శరత్ ఇంట్లోకి చొరబడి.. ముగ్గురి మెడపై కత్తిపెట్టి డబ్బులు డిమాండ్ చేశారు. 48 గంటల పాటు నిర్బంధించారన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. కానీ, పోలీసులు నాలుగు గంటల్లోనే కిడ్నాపర్ల ఆచూకీని కనిపెట్టి సినిమా స్టైల్లో వెంబడించి రౌడీషీటర్ కోలా వెంకట హేమంత్‌కుమార్, రాజేష్‌లను అరెస్టుచేయడంతో కిడ్నాప్ కథ సుఖాంతమైంది. వారి చెర నుంచి ఎంపీ ఎంవీవీ భార్య జ్యోతి, కుమారుడు శరత్, ప్రముఖ ఆడిటర్ గన్నమనేని వెంకటేశ్వరరావు (జీవీ) సురక్షితంగా బయటపడ్డారు. ఈ కిడ్నాప్ వ్యవహారంలో మరో ఐదుగురి పాత్ర కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించి వారి కోసం గాలిస్తున్నారు. వివరాలివీ..



నిందితుడు హేమంత్ కుమార్ (ఫైల్)

కిడ్నాప్ జరిగింది ఇలా..

ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుమారుడు శరత్ రుషికొండ ప్రాంతంలో తారకరామ లేఅవుట్‌లో ఉంటున్నారు. ఈనెల 13వ తేదీ ఉదయం కొందరు దుండగులు ఆ ఇంట్లోకి చొరబడ్డారు. లోపల శరత్ ఒక్కడే ఉండడంతో అతడిని నిర్బంధించి ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలను దోచుకున్నారు. ఇంకా డబ్బు కావాలని దాడిచేశారు. తన వద్ద లేదని చెప్పినా వినలేదు. దీంతో మరుసటి రోజు బుధవారం శరత్‌తో లాసెన్స్ బే కాలనీలో ఉంటున్న తల్లి జ్యోతికి ఫోన్ చేయించారు. తన ఆరోగ్యం బాగోలేదని, ఇంటికి రావాలని బలవంతంగా చెప్పించారు. అది నిజమని నమ్మిన అతడి తల్లి జ్యోతి కంగారుగా బుధవారం కొడుకు ఇంటికి వచ్చారు. ఆమెను కూడా బంధించి ఆమె వద్ద ఉన్న బంగారు నగలను కాజేశారు. భారీగా డబ్బులు కావాలన్న ఉద్దేశంతో ఎంపీతో సన్నిహితంగా ఉండే ప్రముఖ ఆడిటర్ జీవీకి జ్యోతితో ఫోన్‌చేసి రప్పించారు. జీవీని కూడా నిర్బంధించి రూ.2 కోట్లు కావాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తామని ముగ్గురి మెడపై కత్తిపెట్టి బెదిరించారు. దీంతో జీవీ తనకు తెలిసిన వారికి ఫోన్‌చేసి రూ.1.75 కోట్లు సమకూర్చి వారికి అందించారు. అయినప్పటికీ వారిని విడిచిపెట్టకుండా ఇంకా డబ్బులు కావాలని కిడ్నాపర్లు డిమాండ్ చేశారు. మధ్యలో ఎంపీ తన కుమారుడు శరత్‌కు ఫోన్‌చేసినప్పటికీ కిడ్నాపర్ల సూచనల మేరకు మామూలుగానే మాట్లాడి ఫోన్ పెట్టేశారు.

ఎంపీ ఎంవీవీకి అనుమానం వచ్చి..

ఐటీ రిటర్నుల పనుల నిమిత్తం హైదరాబాద్‌లో ఉన్న ఎంపీ ఎంవీవీ.. ఆడిటర్ జీవీకి బుధవారం మధ్యాహ్నం నుంచి పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ లిఫ్ట్ చేయలేదు. అతడి సన్నిహితులకు ఫోన్‌చేయగా.. శ్రీకాకుళం వెళ్లినట్లు చెప్పారు. అక్కడి వారికి ఫోన్‌చేసి ఆరాతీస్తే శ్రీకాకుళం కూడా రాలేదని సమాచారమిచ్చారు. జీవీకి ఏమైందన్న ఆందోళనతో ఎంపీ విశాఖ పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మకు ఫోన్‌చేసి అతని నంబర్‌ను ట్రాక్ చేయాలని కోరారు. పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా జీవీ రుషికొండలోనే ఉన్నట్లు గుర్తించారు. అతని డ్రైవర్‌తో పాటు మరికొంత మంది ద్వారా సమాచారం సేకరించి సాంకేతికత సాయంతో విచారణ చేపట్టారు. దీంతో కిడ్నాప్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

సినీ ఫక్కీలో ఛేజ్ చేసి..

మరోవైపు.. రెండ్రోజులుగా ముగ్గురిని ఇంట్లోనే నిర్బంధించిన విషయాన్ని పోలీసులు గుర్తించే అవకాశం ఉందని గ్రహించిన కిడ్నాపర్లు వారిని అక్కడ నుంచి విజయనగరం వైపు తరలించేందుకు ప్రయత్నించారు. శరత్‌కు చెందిన ఆడి కారులో వారిని ఎక్కించుకుని పద్మనాభం నుంచి ఎస్.కోట మీదుగా విజయనగరం వెళ్లేందుకు బయల్దేరారు. పోలీసులు అప్పటికే మొబైల్స్, ఇతర టెక్నాలజీల ఆధారంగా ప్రతి ప్రాంతంలోనూ చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. వారు ఆనందపురం మీదుగా పద్మనాభం వైపు వెళ్తున్నట్లు తెలుసుకుని వారి కారును వెంబడించారు. ఆనందపురం మండలం పందలపాక గ్రామానికి వారి కారు చేరుకోగానే ముందు నుంచి పద్మనాభం సీఐ బృందం, వెనుక నుంచి పీఎంపాలెం సీఐ బృందాల వాహనాలు అడ్డగించాయి. అయినప్పటికీ కిడ్నాపర్లు కారు ఆపకుండా ముందుకు వెళ్లే ప్రయత్నంలో పోలీస్ వాహనాన్ని బలంగా ఢీకొట్టారు. వెంటనే కారులో ఉన్న కిడ్నాపర్లు రౌడీషీటర్ కోలా వెంకట హేమంత్‌కుమార్, రాజేష్‌లు బయటకు దిగి పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. ఎంపీ కుటుంబ సభ్యుల కోసం ఆరా తీశారు. అయితే, వారిని బాకురుపాలెం ప్రాంతంలోనే విడిచిపెట్టినట్లు చెప్పడంతో మరో పోలీస్ బృందం వారికోసం గాలింపు చేపట్టింది. ఇంతలో వారు ఆర్టీసీ బస్సులో వెళ్తున్నట్లు తెలుసుకుని వారిని సురక్షితంగా కమిషనరేట్‌కు తరలించారు.

తెయూ విద్యార్థుల ఆకలికేకలు



తండాలో భిక్షాటన చేస్తున్న విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో హాస్టల్స్ విద్యార్థుల ఆకలి కేకలు మిన్నంటాయి. జీతాల కోసం తెయూ అవుట్ సోర్సింగ్ సిబ్బంది విధులను బహిష్కరించి నిరవధిక సమ్మెకు దిగి మంగళవారం మధ్యాహ్నం నుంచి వంటలు చేయట్లేదు. దీంతో విద్యార్థులు పస్తులుంటున్నారు. బుధవారం ఉదయం అల్పాహారం 11 గంటలకు రాగా మధ్యాహ్న భోజనం సాయంత్రం 5.30కి వచ్చింది. ఇక గురువారమైతే భోజనాలు లేకుండా పోయాయి. దీంతో హాస్టల్స్ విద్యార్థులు తెయూ మెయిన్ గేటు ఎదుట ఖాళీ ప్లేట్లతో బైఠాయించి నిరసన చేపట్టారు. కొందరు విద్యార్థులు పక్కనే ఉన్న నడిపల్లి తండాకు వెళ్లి ఇంటింటికీ తిరిగి భిక్షాటనతో కడుపు నింపుకున్నారు. వీసీ ప్రొఫెసర్ డి రవీందర్ నిర్లక్ష్యం వల్ల అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలు రాలేదనీ, వారు సమ్మె బాట పట్టడంతో క్యాంపస్ హాస్టల్స్ విద్యార్థులు అన్నం లేక పస్తులుండాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

పట్టుపట్టి పరిహారం సాధించిన 'మహా'రైతులు

కాళేశ్వరం: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ తాలూకా రైతులు కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీ బ్యాక్ వాటర్‌తో ముంపునకు గురవుతున్న పంట భూములకు అక్కడి ప్రభుత్వంతో పట్టుపట్టి నష్ట పరిహారం సాధించారు. రూ.26 కోట్ల పరిహారం చెక్కులను గురువారం సిరొంచలోని తహసీల్దార్ కార్యాలయంలో గడ్చిరోలి ఎంపీ అశోక్‌నేతే, ఎమ్మెల్సీ రాందాస్ అంబేడ్కర్‌ల చేతుల మీదుగా 300 మంది రైతులకు అందజేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో తెలంగాణ ప్రభుత్వం గోదావరిపై నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీ అవతలి వైపు సిరొంచలోని 11 గ్రామాల రైతులు నాలుగేళ్లుగా ముంపుతో పంటలు నష్టపోతున్నారు. 128 హెక్టార్ల భూమికి రూ.37 కోట్ల పరిహారం ఇవ్వాల్సి ఉండగా, తెలంగాణ ప్రభుత్వం రూ.11 కోట్ల పరిహారాన్ని ఇచ్చింది. మిగతా పరిహారం కోసం రైతులు ఒత్తిడి తేవడంతో మహారాష్ట్ర ప్రభుత్వం ఆ పరిహారం అందజేసింది.

'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపిన 'మహా'రైతులు

పరిహారంకోసం రెండు సార్లు రిలే దీక్షలు చేసిన మహారాష్ట్ర రైతుల పక్షాన 'సాక్షి'పలుమార్లు కథనాలు ప్రచురించింది. దీంతో తమకు సాక్షి బాసటగా నిలిచిందని బాధిత రైతులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

కొలనుపాకలో మఠాలన్నీ ఒకప్పుడు జైన బసదులే



జైన ఆలయంలో కాకతీయ శైలిలో నల్లరాతి స్తంభం

ఆలేరు రూరల్: కొలనుపాకలో శైవ దేవాలయాలుగా భావిస్తున్న కుల మఠాలన్నీ ఒకప్పుడు జైన బసదులే అని కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు. గురువారం ఆయన యాదాద్రి భువనగిరి జిల్లా కొలనుపాక జైన దేవాలయాన్ని సందర్శించారు. ఆలయంతో పాటు ప్రాంగణంలోని కట్టడాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర కూటుల పాలన చివరి దశలో జైన దేవాలయాలు శైవ దేవాలయాలుగా మారాయన్నారు. కళ్యాణి చాళుక్యుల సమయంలోనే జైన బసదులను కూల్చి శివాలయాలుగా మార్చారన్నారు. జైన దేవాలయం ఎదురుగా ఉన్న తోటలో తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో శివలింగం, దేవాలయ శిథిలాలున్నాయన్నారు. జైన ఆలయం ఎదుట రోడ్డుకు అవతల దేవాలయ శిథిలాలు పెద్దసైజు ఇటుకల కింద ఇప్పటికీ ఉన్నట్లు తెలిపారు.

'మార్గదర్శి' చరాస్తులు రూ.242.03 కోట్లు అటాచ్

- వీటిలో 40 మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు, డిపాజిట్లు
- చిట్టీల మొత్తం చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తున్న 'మార్గదర్శి'
- చందాదారుల ప్రయోజనాల పరిరక్షణకు సీఐడీ కఠిన చర్యలు
- మొత్తం రూ.1,035.53 కోట్ల అటాచ్‌మెంట్‌కు నిర్ణయం
- ఇంతకు ముందు రూ.793.50 కోట్ల చరాస్తులు అటాచ్



సాక్షి, అమరావతి: ఆర్థిక అక్రమాలకు పాల్పడిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎంసీఎఫ్ఎల్)పై మరిన్ని కఠినచర్యలకు సీఐడీ ఉపక్రమించింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థకు చెందిన రూ.242.03 కోట్ల చరాస్తులను అటాచ్ చేసేందుకు సిద్ధమవుతోంది. వాటిలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ 40 మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టిన పెట్టుబడులు, బ్యాంకుల్లో డిపాజిట్లు కూడా ఉన్నాయి. సీఐడీ వినతి మేరకు హోంశాఖ గురువారం ఇందుకు సంబంధించి అనుమతి జారీ చేసింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ కొన్నాళ్లుగా చందాదారులకు చిట్టీల మొత్తాన్ని చెల్లించడంలో జాప్యం చేస్తోంది. దీంతో చందాదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం సీఐడీ కఠిన చర్యలు చేపట్టింది. కొద్ది రోజుల క్రితమే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు చెందిన రూ.793.50 కోట్ల చరాస్తులను అటాచ్ చేసేందుకు రంగం సిద్ధం చేసింది. తాజాగా రూ.242.03 కోట్లతో కలిపి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు చెందిన మొత్తం రూ.1,035.53 కోట్ల చరాస్తులను అటాచ్ చేసేందుకు సీఐడీ సన్నద్ధమవుతోంది.

అగమ్యగోచరంగా మార్గదర్శి

కేంద్ర చిట్‌ఫండ్ చట్టం, రిజర్వ్ బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ యథేచ్ఛగా ఆర్థిక అక్రమాలకు పాల్పడుతోందని రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ తనిఖీల్లో వెల్లడైంది. ఆ శాఖ ఫిర్యాదు మేరకు సీఐడీ విభాగం మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై కేసు నమోదు చేసింది. ఆ సంస్థ చైర్మన్ చెరుకూరి రామోజీరావును ఏ-1గా, ఎండీ చెరుకూరి శైలజ కిరణ్‌ను ఏ-2గా, బ్రాంచి మేనేజర్లను ఏ-3గా ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. సీఐడీ అధికారులు చేసిన సోదాల్లో మార్గదర్శి చిట్‌ఫండ్స్ దశాబ్దాలుగా పాల్పడుతున్న ఆర్థిక అక్రమాలు ఆధారాలతో సహా బట్టబయలయ్యాయి. కాగా మరోవైపు కేంద్ర చిట్‌ఫండ్ చట్టాన్ని కచ్చితంగా పాటించాలని రాష్ట్ర చిట్స్ రిజిస్ట్రార్ మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు స్పష్టం చేశారు. ఆ చట్టం ప్రకారం చందాదారుల సొమ్మును ఇతర అవసరాలకు మళ్లించకూడదు. ఏ బ్రాంచి చందాదారుల సొమ్మును అదే నగరం/పట్టణంలోని జాతీయ బ్యాంకులోని ఖాతాలో జమ చేయాలి. కానీ రామోజీరావు చందాదారుల సొమ్మును హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయానికి తరలించి, అక్కడి నుంచి సొంత కంపెనీలలోకి మళ్లిస్తున్నారు. ఆ సంస్థల ద్వారా మ్యూచువల్ ఫండ్స్, షేర్ మార్కెట్‌లలో పెట్టుబడిగా పెడుతున్నారు. ఇది కేంద్ర చట్టానికి విరుద్ధం. కేంద్ర చట్టాన్ని పాటించేందుకు ససేమిరా అంటున్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ గత ఏడాది డిసెంబర్ నుంచి కొత్త చిట్టీలను వేయడం లేదు. దాంతో ఇప్పటికే దాదాపు రూ.400 కోట్ల వరకు టర్నోవర్ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో పాత చందాదారులకు చిట్టీ పాటల మొత్తాన్ని చెల్లించడంలో తీవ్ర జాప్యం చేస్తోంది. దీనిపై ఇప్పటికే పలువురు చందాదారులు చిట్స్ రిజిస్ట్రార్, సీఐడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో చందాదారుల హక్కుల పరిరక్షణ కోసం మార్గదర్శి చిట్‌ఫండ్స్ చరాస్తులను జప్తు చేయాల్సిన అవసరం ఉందని సీఐడీ భావించింది. అగ్రిగోల్డ్ కంపెనీ తరహాలో రాబోయే రోజుల్లో మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యం చేతులెత్తేస్తే చందాదారుల సొమ్మును వారికి తిరిగి చెల్లించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ చరాస్తులను అటాచ్ చేసేందుకు అనుమతి కోరుతూ సీఐడీ విభాగం త్వరలోనే న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయనుంది.

మంత్రి 'గంగుల'ను అడ్డుకున్న దళితులు

- దళితబంధు ఇవ్వాలంటూ ఆందోళన



దళితులతో మాట్లాడుతున్న మంత్రి కమలాకర్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో దళితబంధు పథకాన్ని తమకూ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంత్రి గంగుల కమలాకర్‌ను దళితులు అడ్డుకున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన పల్లె ప్రగతి కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి కమలాకర్‌ను వేదిక వద్దకు వెళ్లకుండా అడ్డుకుని బైఠాయించారు. పోలీసులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో ఆగ్రహించిన దళితులు ఆందోళనను మరింత ఉధృతం చేశారు. పక్క గ్రామంలో దళితబంధు అమలు చేశారని, చెర్లభూత్కూర్‌లో ఎవరికీ ఎందుకివ్వలేదని నిలదీశారు. విడతల వారీగా అందరికీ ఇస్తామని మంత్రి హామీనివ్వడంతో దళితులు ఆందోళన విరమించారు.

జిల్లా వార్తలు

సింగరేణి పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు 27న కౌన్సెలింగ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఆధ్వర్యాన సీసీసీ నస్పూర్‌లో నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ కళాశాలలో 150 సీట్ల భర్తీకి ఈ నెల 26న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేశ్ తెలిపారు. దరఖాస్తు గడువు 23వ తేదీతో ముగియనుండగా, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. కళాశాలలో సివిల్, కంప్యూటర్, ఎలక్ట్రికల్–ఎలక్ట్రానిక్స్, మెకానిక్, మైనింగ్ విభాగాల్లో 30 చొప్పున సీట్లు ఉన్నాయని తెలిపారు. పాలిసెట్–23లో ర్యాంకు సాధించిన సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లలు మాత్రమే అర్హులని తెలిపారు. సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుని డౌన్‌లోడ్ చేసుకున్నాక ఫొటో అతికించి మైన్ మేనేజర్/ విభాగం ముఖ్య అధికారితో అటెస్టేషన్ చేయించుకోవాలని సూచించారు. ఆ తర్వాత విద్యార్హత, కులధ్రువీకరణ పత్రాల ఒరిజినల్స్‌తో పాటు మూడుసెట్ల జిరాక్స్ కాపీలతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని జీఎం ఓ ప్రకటనలో వివరించారు.

'నాట్స్' సావనీర్‌లో అశ్వారావుపేటకు స్థానం



ప్రభాకరాచార్యులు, పూజితాశ్రీ

అశ్వారావుపేట రూరల్: నార్త్ అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్) నిర్వహించిన అమెరికా తెలుగు సంబురాల సందర్భంగా ప్రచురించిన ప్రత్యేక సంచికలో అశ్వారావుపేటకు చెందిన కవుల రచనలకు స్థానం దక్కింది. ఈ మేరకు న్యూజెర్సీలో జరిగిన అమెరికా తెలుగు సంబురాల్లో నాట్స్ కార్యవర్గం ప్రత్యేక సంచికను విడుదల చేయగా, అశ్వారావుపేటకు చెందిన బాల కవయిత్రి సిద్ధాంతపు పూజితాశ్రీ రచించిన 'మొక్కను నాటి మేలు చేద్దాం' కవిత, రచయిత సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు రాసిన 'అరిషడ్వర్గాలు – కాళికాంబాసప్తశతి' వ్యాస రచనలకు చోటు కల్పించారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

నేడు ఉమ్మడి జిల్లాలో ఎంపీ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం, మధిర, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగే తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో ఆయన పాల్గొననున్నారు. అలాగే పలు గ్రామాల్లో ఇటీవల కన్నుమూసిన వారి కుటుంబాలను పరామర్శిస్తారు.

నానాటికీ తగ్గుతున్న 'సింగరేణి' బలం

- లక్ష పైచిలుకు నుంచి 42 వేలకు పడిపోయిన కార్మికులు
- ఇదే సమయాన పెరుగుతున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యం
- ఫలితంగా ఉన్న వారిపై పెనుభారం



భూగర్భ గనుల్లో పని చేస్తున్న కార్మికులు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధిలో గతంలో 56 భూగర్భ గనుల్లో సుమారు 1.16 లక్షల మంది కార్మికులు పనిచేసేవారు. అయితే, ఆ రోజుల్లో 20 మిలియన్ టన్నులు ఉత్పత్తి నమోదయ్యేది. కానీ, గడిచిన ఆర్థిక సంవత్సరం (2022–23)లో 42,733 మంది కార్మికులు ఉండగా, 70 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సింగరేణిలో 42 వేల మంది కార్మికులు పనిచేస్తున్నట్లు సింగరేణి గణాంకాలు చెబుతుండగా 75 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించడం గమనార్హం.

పెరుగుతున్న గైర్హాజరు శాతం

సింగరేణిలో 45 నుంచి 55 ఏళ్ల వయసు వారు 60 శాతం ఉండటంతో లక్ష్యం మేరకు ఉత్పత్తి సాధ్యం కావడం లేదని అధికారులు భావించారు. దీంతో డిపెండెంట్ల (కార్మికుల పిల్లలు)కు ఉద్యోగావకాశాలు కల్పిస్తే యువత ఉండటంతో ఉత్పత్తి పెరుగుతుందనే నిర్ధారణకు వచ్చారు. ఈ మేరకు వేలాది మంది డిపెండెంట్లకు ఉద్యోగావకాశాలు కల్పించినా వారిలో కనీసం 10 శాతం మంది అసలు విధుల్లోకే రావటం లేదు. సాఫ్ట్‌వేర్, ఇతర ఉద్యోగాలు చేసిన వారికి గనుల్లో విధులు కేటాయించడంతో చేయలేక విధులకు హాజరుకావటం లేదని తెలుస్తోంది. సింగరేణి సంస్థలో ప్రస్తుతం ఉన్న 42 వేల మంది కార్మికుల్లో సుమారు 4 వేల మంది గైర్హాజరవుతున్నారని అంచనా. వారికోసం కంపెనీ అధికారులు కుటుంబాలతో కలిపి పలుమార్లు కౌన్సెలింగ్ ఇస్తూ వారానికి రెండు మస్టర్లు పడినా ఉద్యోగ భద్రత ఉంటుందని చెబుతున్నప్పటికీ పెద్దగా ఫలితం ఉండటం లేదు.

సర్ఫేస్ ఉద్యోగాలపైనే మక్కువ

సింగరేణి సంస్థలో తండ్రి ఉద్యోగం కొడుకు (డిపెండెంట్)కు రావాలంటే తండ్రి మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయి, సదరు ఉద్యోగం చేసేందుకు కుమారుడు సంపూర్ణ ఆరోగ్యవంతుడైతేనే అంగీకరిస్తారు. జాయినింగ్ రిపోర్ట్ అందిన 41 రోజుల పాటు మైన్స్ ఒకేషనల్ ట్రెనింగ్ సెంటర్ (ఎంవీటీసీ)లో శిక్షణ తీసుకున్నాక గని ఉద్యోగిగా చేరాలని డీజీఎంఎస్ నిబంధనలు ఉన్నాయి. కానీ, సింగరేణిలో గుర్తింపు సంఘంగా టీబీజీకేఎస్ ఎన్నికయ్యాక ప్రజాప్రతినిధుల నుంచి కార్మికులకు సిఫారసు లెటర్లు పెద్ద సంఖ్యలో అందుతున్నాయి. ఉద్యోగంలో చేరిన వారికి గనుల్లో పని కేటాయించకుండా సర్ఫేస్ జాబ్ (లైట్ జాబ్) కేటాయించాలని సిఫారసు వస్తుండటంతో అధికారులు ఏం చేయలేని స్థితి ఎదుర్కొంటున్నారు. ఇలా రకరకాల కారణాల తో అండర్ గ్రౌండ్‌లో పనిచేసే కార్మికుల సంఖ్య తగ్గుతుండగా ఉన్న వారిపైనే భారం పడుతోంది. ఈ విషయంలో గైర్హాజరయ్యే వారికి కౌన్సెలింగ్ ఇచ్చే సమయాన కార్మిక సంఘాల నేతలు కీలక పాత్ర పోషించాల్సి ఉండగా పెద్దగా పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి.

సంవత్సరం	కార్మికుల సంఖ్య	బొగ్గు ఉత్పత్తి లక్ష్యం (మిలియన్ టన్నుల్లో)	సాధించిన బొగ్గు ఉత్పత్తి
2014-15	61,778	54.00	52.54
2015-16	56,837	60.00	60.38
2016-17	58,491	64.00	61.34
2017-18	56,282	65.00	62.00
2018-19	54,043	65.00	64.40
2019-20	48,942	66.00	64.02
2020-21	46,021	68.00	50.58
2021-22	43,672	68.00	65.02
2022-23	42733	70.00	67.14
2023-24	42,112	75.00	.....

కంపెనీ అప్పగించిన పని చేసేలా సర్క్యులర్



సింగరేణి సంస్థ మనుగడ సాగాలంటే గనులు నడవాలి. లక్ష్యం మేరకు ఉత్పత్తి జరగాలి. అయితే, ఓసీల్లో 80 శాతం, భూగర్భ గనుల్లో 20 శాతం మాత్రమే ఉత్పత్తి నమోదవుతుంది. ప్రతి ఒక్కరూ సర్ఫేస్ పనులే చేస్తామంటుండటంతో భూగర్భ గనుల్లో పనిచేసే వారి సంఖ్య తగ్గుతోంది. ఈ విషయమై త్వరలోనే సంస్థ అప్పగించిన ఏ పనైనా చేసేలా సర్క్యులర్ తీసుకురావాలనే ఆలోచనకు వచ్చాం.

–ఎస్.బలరాం, సింగరేణి డైరెక్టర్ (పా)

కార్మిక వర్గ ఐక్యతకు సీఐటీయూ కేంద్ర బిందువు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఖమ్మంమయూరిసెంటర్: కార్మిక వర్గ ఐక్యతకు సీఐటీయూ కేంద్ర బిందువుగా నిలుస్తూ కార్మికుల హక్కుల సాధనకు జరిగిన అనేక పోరాటాల్లో కీలక పాత్ర పోషించిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఖమ్మంలో సీఐటీయూ జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబుతో కలిసి గురువారం శంకుస్థాపన చేసిన ఆయన మాట్లాడారు. ఖమ్మంలో నిర్మించే బీటీ.రణదివే భవనం కార్మిక హక్కుల్ని రక్షించుకునే పోరాటాల రూపకల్పనకు వేదిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ రావు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రైతు సంఘం నాయకుడు నున్నా నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మ విష్ణువర్ధన్, కళ్యాణం వెంకటేశ్వరరావుతో పాటు పి.రాజారావు, ఏ.జె.రమేష్, బి.మధు, ఎర్ర శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వరరావు, లింగమూర్తి, ఆర్.కోటంరాజు, సాంబశివరావు, బండి రమేష్, వై.విక్రమ్, పి.రమ్య తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదులు చేయొచ్చు

సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ



మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

దమ్మపేట: విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై తమకు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని ఎన్పీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ వెల్లడించారు. దమ్మపేట మండలం మందలపల్లి సబ్‌స్టేషన్‌లో అశ్వారావుపేట సబ్ డివిజన్‌కు సంబంధించి విద్యుత్ వినియోగదారుల సదస్సు(కోర్టు)ను గురువారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సీజీఆర్ఎఫ్ చైర్మన్‌కు స్థానిక రైతులు, ప్రజలు విద్యుత్ లైన్లు, కనెక్షన్లు, లోటట్టేజీ తదితర సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. అనంతరం చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్ రంగ సమస్యలపై వినియోగదారుల ఫోరంను ఆశ్రయించవచ్చని తెలిపారు. సదస్సుల్లోనే కాక ఆన్‌లైన్‌లో, వాట్సప్, ఈ–మెయిల్ ద్వారా కూడా ఫిర్యాదుకు అవకాశముందని చెప్పారు. సమస్య సరైనదేనని నిర్ధారణ అయితే బాధ్యులైన సిబ్బందికి జరిమానా విధించడమే కాక 45 రోజుల్లోగా పరిష్కరిస్తామని వివరించారు. ఈ సదస్సులో ఫోరం సభ్యులు తిరుమల్‌రావు, చరణ్‌దాస్, నరేందర్, జెడ్పీటీసీ సభ్యుడు పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, ఏడీఈ వెంకటేశ్వర్లు, ఏఈలు మహేశ్, సాయికిరణ్, వెంకటకృష్ణతో పాటు దారా మల్లికార్జున్‌రావు, దారా యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో నలుగురు జీఎంల బదిలీ

ఐదుగురు ఏజీఎంలకు కూడా స్థానచలనం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని వివిధ ఏరియాల్లో విధులు నిర్వర్తిస్తున్న నలుగురు జీఎంలు, ఐదుగురు ఏజీఎంలను బదిలీ చేశారు. యాజమాన్యం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేశ్‌ను కార్పొరేట్ సీపీపీ జీఎంగా, ఇల్లెందు జీఎం ఎం.శాలెంరాజును కొత్తగూడెం ఏరియా జీఎంగా, కార్పొరేట్ డైరెక్టర్ ఎస్‌ఓటూ జీఎం సుధాకర్‌రావును ఆర్జీ–3 ఏరియా జీఎంగా, బెల్లంపల్లి రీజియన్ జీఎం (సేఫ్టీ) జాన్ ఆనంద్‌ను ఇల్లెందు ఏరియా జీఎంగా బదిలీ చేశారు. అలాగే, ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ కార్పొరేట్‌లో అడిషనల్ జీఎం కె.సాయిబాబును కార్పొరేట్ పీపీ ఎస్‌ఓటూ జీఎంగా బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇంకా బెల్లంపల్లి ఏరియా ఎస్‌ఓటూ ఏజీఎం కే.హెచ్.ఎం.గుప్తాను బెల్లంపల్లి రీజియన్ జీఎం (సేఫ్టీ)గా, కార్పొరేట్ సేఫ్టీ విభాగం ఏజీఎం కృష్ణగోపాల్ తివారీని ఆర్జీఎం ఎక్స్‌ప్లోజివ్ ఏజీఎంగా, బీడీ కార్పొరేట్ ఏజీఎం సుశాంత్ సహాను జీఎం బీడీ కార్పొరేట్‌కు, మణుగూరు ఏరియా ఎస్‌ఓటూ జీఎం లలిత్‌కుమార్‌ను డైరెక్టర్ ఆపరేషన్స్, డైరెక్టర్ పీపీ ఎస్‌ఓటూ డైరెక్టర్ విభాగం ఏజీఎంగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

వ్యవసాయ సర్వీసుల జారీలో జాప్యం చేయొద్దు

ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న దృష్ట్యా దరఖాస్తు చేసుకున్న రైతులకు వెంటనే విద్యుత్ సర్వీసులు జారీ చేయాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు ఆదేశించారు. హనుమకొండలోని సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి గురువారం ఆయన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వ్యవసాయ సీజన్‌లో రైతులు ఇబ్బంది పడకుండా కనెక్షన్ల జారీపై దృష్టి సారించాలని తెలిపారు. అలాగే, పనిచేయని, నిలిచిపోయిన మీటర్ల స్థానంలో కొత్తవి అమర్చాలని, ఈ వ్యవహారంలో ఎక్కడా నిర్లక్ష్యం జరగకుండా చూడాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలను గణనీయంగా తగ్గించేలా సమస్యలు పరిష్కరించాలని సీఎండీ స్పష్టం చేశారు. వీసీలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల విద్యుత్ సర్కిల్ ఆపరేషన్స్ సూపరింటెండెంట్ ఇంజనీర్లు ఎ.సురేందర్, రమేశ్‌తో పాటు రెండు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

కందాళ.. సరదాగా ఈత!

అసలే ఎండలు మండిపోతున్నాయి. ఆపై వరుస పర్యటనలు! గురువారం మండలంలోని పలు కార్యక్రమాలకు హాజరైన పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి రాజీవ్ గృహకల్ప పక్కనే మున్నేరులో నిండా నీరు కనిపించగానే కాసేపు ఈత కొట్టి వేసవి తాపం తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

– ఖమ్మంరూరల్

